క్లుప్తంగా

ఆరుగురు జూదరుల అరెస్టు

రూ.15,600 నగదు స్వాధీనం

నాదెండ్ల: గుట్టుచప్పుడు కాకుండా గ్రామ శివారులో కోతముక్క ఆడుతున్న ఆరుగురు జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు మంగళవారం అర్ధరాత్రి నాదెండ్ల శివారు చలమకొండల సమీపంలోని రేకుల షెడ్డులో పేకాటాడుతున్నారన్న సమాచారంతో దాడి చేసి ఆరుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద రూ.15,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

రొంపిచర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యశాలలోని ప్రదేశాలను సందర్శించి పరిశుభ్రతపై సిబ్బందితో వాకబు చేశారు. రికార్డులను పరిశీలించారు. ఓపీకి వచ్చిన వారి నుంచి వారికి అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి డాక్టర్ పి.జగన్‌నరసింహారెడ్డి పాల్గొన్నారు.

మాలధారులకు భిక్ష ఏర్పాటు అభినందనీయం

నాదెండ్ల: దేవుడిపై అచంచల విశ్వాసంతో మాల ధరించి దీక్షలు చేస్తున్న భక్తులకు భిక్ష ఏర్పాటు చేయటం అభినందనీయమని పర్చూరు ఎస్‌ఐ జీవీ చౌదరి చెప్పారు. గణపవరం కుప్పగంజివాగు సమీపంలో నిర్మాణంలో ఉన్న అయ్యప్ప స్వాముల అన్నదాన కార్యక్రమంలో మంగళవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా అయ్యప్పస్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వయంగా మాలధారులకు అన్నప్రసాద వితరణ చేశారు. గురుస్వాములు మండలనేని వెంకటేశ్వర్లు, కాట్రు రమేష్, శివనారాయణరాజు, వజ్జా బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పీ-4 సర్వే వేగవంతం చేయాలి

శావల్యాపురం: పేదరిక నిర్మూలనకు పీ-4పోర్ దోహదపడుతుందని జిల్లా ఉపాధి పథకం పీడీ సిద్ధా లింగమూర్తి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ4 సర్వే పురోగతిపై గ్రామసచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పీడీ లింగమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు జిల్లా కలెక్టరు ఆదేశాలకు అనుగుణంగా వినుకొండ నియోజకవర్గంలో పీ4 పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న కుటుంబాల వారందరు పీ4 సర్వేకు అర్హులన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో 9850 మందిని సర్వేలో గుర్తించగా ఇప్పటి వరకు 402 మంది మార్గదర్శకులు 5730 కుటుంబాల వారిని దత్తత తీసుకున్నట్లు తెలిపారు. దత్తత తీసుకున్న వారి జీవనోపాదులు పెంపుదలతో ఆర్థిక ప్రగతి సాధించటానికి మార్గదర్శకులు చేయూత నిస్తారన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పి.సుగుణ తదితరులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నరసరావుపేట: వ్యాపారులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పల్నాడురోడ్డులో ఆకస్మికంగా పర్యటించారు. టీబంకులు, తోపుడు బండ్లు, పండ్ల వ్యాపార కేంద్రాలను పరిశీలించారు. కొందరు వ్యర్థాలను సమీపంలోని రోడ్డుపై పడేయటాన్ని గమనించి రూ.1400 జరిమానా విధించారు. ఆ రుసుంను వసూలుచేసి పురపాలక సంఘానికి జమ చేయించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రెండు బుట్టల విధానాన్ని అనుసరించాలని సూచించారు. టీకొట్ల నిర్వాహకులు వినియోగించే కప్పులను వాడి పడేసిన కప్పులను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. తోపుడు బండ్లు, వ్యాపార దుకాణాల వద్ద చెత్త రోడ్డుపై వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించేందుకు సచివాలయ పారిశుద్ధ్య కార్యదర్శులు, శానిటేషన్ మేస్త్రీలు నిత్యం అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

నేషనల్ అడ్వకేట్స్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక

నరసరావుపేట టౌన్: పట్టణానికి చెందిన యువ న్యాయవాది గెరా రవి గాంధీ నేషనల్ అడ్వకేట్స్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం న్యాయవాద సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రవిని సంఘం అధ్యక్షుడు ఎం.సుబ్బారావుతో పాటు న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. ఈనెల 29 నుంచి అక్టోబర్ 2 వరకు ఢిల్లీలో నిర్వహించే ఆలిండియా అడ్వకేట్స్ క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొని ఆడనున్నట్లు రవి తెలిపారు.

ఐడీబీఐ సహకారంతో వాటర్ ప్లాంట్

నరసరావుపేట: ఏరియా ప్రభుత్వాసుపత్రిలో ఐడీబీఐ బ్యాంకు నరసరావుపేట శాఖ సహకారంతో సుమారు రూ.3లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు బుధవారం వైద్యశాలను బ్యాంకు మేనేజర్ కె.దివ్యభారతీ, వైద్యశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి పరిశీలించి ప్లాంట్ ఏర్పాటుకు సంబందించిన పనులు పర్యవేక్షించారు. ప్రస్తుతం ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మత్తులకు గురైంది. స్థానిక ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ భవ్యభారతిని సంప్రదించగా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు అంగీకరించారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.సురేష్‌బాబు, ఆర్ఎంఓ ఏడుకొండలు, మెన్నా రవీంద్రరెడ్డి, న్యాయవాది డాక్టర్ గోదా రమేష్ కుమార్ పాల్గొన్నారు.

మాతా అన్నపూర్ణేశ్వరీ..!


శివప్రియనగర్ గండిపోచమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా..


గణపవరంలో అన్నపూర్ణాదేవిగా..


అన్నపూర్ణాదేవిగా బోయపాలెం పార్వతిదేవి


శావల్యాపురంలో అన్నపూర్ణాదేవి అలంకరణ

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో మూడో రోజైన బుధవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో భక్తులు అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల హోమాలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

– నాదెండ్ల /చిలకలూరిపేట /యడ్లపాడు /శావల్యాపురం/ రొంపిచర్ల / నరసరావుపేట ఈస్ట్/ నరసరావుపేట


విప్పర్లలో అన్నపూర్ణా దేవి అలంకరణ


కౌమారీ అలంకరణలో కన్యకా పరమేశ్వరీ


నరసరావుపేటలో అన్నపూర్ణా దేవి అలంకరణలో


రెడ్డినగర్‌లో ఏర్పాటు చేసిన బతుకమ్మ

ఒకేషనల్ శిక్షణతో ప్రత్యేక అవకాశాలు

నాదెండ్ల: ఒకేషనల్ శిక్షణ పొందిన వారికి వివిధ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని హెచ్‌ఎం కృష్ణానాయక్ చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 72 మంది ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఈ నెల 21-30 వరకూ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ దసరా సెలవుల్లో పది రోజుల పాటూ ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెకానిక్ షాపు, బైక్, కారుషోరూంలు, ఆటోమేటిక్ అగ్రికల్చర్ ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు మేధా శక్తి పెంచుకొనుటకు ఒకేషనల్ ట్రైనింగ్ ఎంతగానో ఉపకరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనర్లు టి.హనుసాయికృష్ణ, భరత్‌కుమార్, ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, రత్నరాజు, డి.దివ్యజ్యోతి పాల్గొన్నారు.

డాబాపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

నాదెండ్ల: డాబాపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు సాతులూరు బీసీ కాలనీకి చెందిన కుంభా రామకోటయ్య (46) కూలిపనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన ఇంటి కింది అంతస్తును మరమ్మతులు చేయించుకుంటూ డాబాపై రేకులషెడ్డులో కుటుంబంతో నివసిస్తున్నాడు. ఈ నెల 19న సాయంత్రం 5.30 గంటల సమయంలో ఫోన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు డాబాపై నుంచి జారి కిందపడ్డాడు. డాబాకి పిట్టగోడ లేకపోవటం, గతంలో ఆయనకు ఫిట్స్ వ్యాధి ఉండటంతో ప్రమాదం చోటుచేసుకుందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?!

- మా హయాంలో చేసిన అభివృద్ధిని మీడియా సాక్షిగా చూపిస్తాం..
- టీడీపీ నేతలకు వైఎస్సార్ సీపీ రొంపిచర్ల మండల నాయకుల సవాల్


సమావేశంలో పాల్గొన్న రొంపిచర్ల నాయకులు

నరసరావుపేట: రొంపిచర్ల మండలంలో టీడీపీ నాయకులు ఇప్పటివరకు చేసిన అభివృద్ధి ఏంటో గ్రామాల వారీగా తెలియచేయాలని, మీడియా సాక్షిగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో తాము చేసిన అభివృద్ధిని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్ సీపీ రొంపిచర్ల మండల నాయకులు పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డిపై టీడీపీ నాయకులు అనుచిత వాఖ్యలు చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పార్టీ రొంపిచర్ల మండల కన్వీనర్ కురుకుంట్ల శ్రీనివాసరెడ్డి, నాయకులు మాట్లాడారు. డాక్టర్ గోపిరెడ్డి తన సొంత గ్రామమైన బుచ్చిపాపన్నపాలెం గ్రామాన్ని సుమారు రూ.29.80కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. గ్రామంలో సొసైటీకి గోడౌన్ ఉన్నా యూరియా దించకుండా గోగులపాడు గ్రామంలో దించి టీడీపీ నాయకుల బంధువులు, వాళ్ల అనుచరులకు కట్టలు పంపిణీ చేశారన్నారు. బుచ్చిపాపన్నపాలెంకు కేవలం 200 కట్టలు మాత్రమే యూరియాను ఇచ్చారని, వైఎస్సార్ సీపీ నాయకులు గజ్జల ముసలారెడ్డి, చీమల శ్రీనివాసరెడ్డిలకు యూరియా కట్టలు ఇచ్చామని దుష్ప్రచారం చేస్తున్నారని, వాస్తవానికి ఒక కట్ట కూడా ఇవ్వలేదని, దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు.

బుచ్చిబాపన్నపాలెంలో అభివృద్ధి ఇదిగో..

డాక్టర్ గోపిరెడ్డి రాజకీయాల్లోకి రాకముందే బుచ్చిపాపన్నపాలెం అభివృద్ధి కోసం పాటుపడ్డారన్నారు. తన సొంత మూడెకరాల భూమి ని చెరువు కోసం ఇచ్చి రూ.1.5కోట్లతో చెరువుని నిర్మించారని, 2007 నుంచి ఇంటింటికి మంచి నీటిని సరఫరా చేశారని గుర్తుచేశారు. గ్రామంలో బస్సు షెల్టర్, లైబ్రరీ కోసం తమ సొంత స్థలాన్ని ఇచ్చారని, తన సొంత ఇంట్లో వాటర్ ప్లాంట్‌ను ప్రజల కోసం కట్టించారన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన దగ్గర నుంచి బీసీ, ఎస్సీ కాలనీలో ఐదు బోర్లు నిర్మించారని, తన సొంత నిధులు రూ.1.50కోట్లతో స్థలం కొనుగోలు చేసి దానికి కాంపౌండ్ వాల్ నిర్మించారన్నారు. రూ.1.5కోట్లతో స్థలం కొనుగోలు చేసి కల్యాణమండపాన్ని నిర్మిస్తున్నారన్నారు. రూ.84 లక్షలతో ఆర్‌బీకే, రూ.1.20కోట్లతో ఎంఆర్‌జీఎస్ నిధులతో జగనన్న కాలనీ అభివృద్ధి, రూ.65లక్షలతో ఫేజ్‌వన్, మరో రూ.60లక్షలతో ఫేజ్ 2 కింద సీసీ రోడ్ల అభివృద్ధి చేశారన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు రూ.50వేలు, పీఎంఏవై కింద రూ.60 లక్షలు, ఎస్సీ సబ్ ప్లాన్‌కి రూ.50 లక్షలు, విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రూ.2కోట్లు, గిద్దంగికి రూ.40 లక్షలు, టీటీడీ కళ్యాణ మండపానికి రూ.1.20కోట్లు, జల్‌జీవన్ మిషన్ కింద రూ.50 లక్షలు, వాటర్ ప్లాంట్ కోసం రూ.20 లక్షలు కేటాయించారని పేర్కొన్నారు. ఎక్కడి నుంచో దిగుమతి అయిన నాయకులు బుచ్చిపాపన్నపాలెం గురించి మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. పార్టీ మండల ఉపాధ్యక్షులు పొనుగోటి వెంకట్రావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు అన్నెం పున్నారెడ్డి, గజ్జల ముసలారెడ్డి, ఉపాధ్యక్షులు పచ్చవ రవీంద్రబాబు, చీమల శ్రీనివాసరెడ్డి, రొంపిచర్ల మండలం యూత్ లీడర్, ఆరేపల్లి ఎంపీటీసీ మోతుకూరి వెంకటేష్, కర్లగుంట నాయకులు అక్కయ్య, పోతులూరి సుబ్బారెడ్డి, ఒర్సు కోటేశ్వరరావు, గానుగపంట సుబ్బారెడ్డి మాట్లాడారు.





వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశం బుధవారం ఉదయం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ మంత్రి, చిలకలూరిపేట సమన్వయకర్త విడదల రజని, నరసరావుపేట సమన్వయకర్త డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

పోషకాహారంతో రక్తహీనత నివారణ


తూబాడులో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమం

నాదెండ్ల: మహిళల్లో రక్తహీనత నివారణకు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవటం పరిష్కారమని వైద్యాధికారి జ్ఞానేశ్వరి చెప్పారు. తూబాడులో స్వస్థ్ నారీ – సశక్తి పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళలు పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే రక్తహీనత, పోషకాల లోపం నివారించుకోవచ్చన్నారు. తాజా ఆకుకూరలు, సీజనల్ పండ్లు, చిరుధాన్యాలు, కూరగాయలను నిత్యం ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎక్కడన్నా బాల్యవివాహాలు జరుగుతున్నట్లయితే తమకు సమాచారమివ్వాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ తలతోటి రాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.నిర్మల కృష్ణమాల, సీహెచ్‌ఓ కమలకుమారి, ఏఎన్ఎంలు మాణిక్యం, నాగమణి, సారమ్మ, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, వీఆర్వో చినబ్రహ్మయ్య పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండలంలోని మునుమాక, విప్పర్ల గ్రామాల్లో బుధవారం పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించారు. స్థానిక వంటలను ప్రదర్శించారు. బాలామృతం యొక్క ప్రాధాన్యతను వివరించారు. నూనె, చక్కెర, ఉప్పు వాడకం నియంత్రణ గురించి వివరించారు. కరివేపాకు, మునగాకు వంటి కూరలు, పండ్లు గురించి తెలియజేశారు. వైద్యాధికారి డాక్టర్ జగన్‌నరసింహారెడ్డి, సీడీపీఓ కాంతకుమారి, ఆయా అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

వినుకొండ: మండలంలోని నరగాయపాలెం సెక్టార్‌లోని బ్రాహ్మణపల్లి సచివాలయంలో పోషణ మహా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఎం. నాగరాజుకుమారి తల్లులకు ఐవైసీఎఫ్‌గురించి పిల్లలకు అపార ఐడీ గురించి, పిల్లలకు అపార ఐడీ గురించి వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ పార్వతి, ఏఎన్ఎం సంపూర్ణ, ఏడబ్ల్యూడబ్ల్యూ వెంకటపద్మ, కోమలీదేవి, హైమావతి, మెర్సీ పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లను అడ్డుకోవాలి


జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు, పీడీఎం నాయకులు

నరసరావుపేట: పిడుగురాళ్ల మండలం వీరాపురం గ్రామానికి చెందిన పరుచూరి పద్మలతకు చెందిన సర్వే నంబర్ 56లోని 1.40ఎకరాల భూమికి చేసిన అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుచేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ముందు బాధితురాలితో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన కార్యక్రమం చేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ పద్మలత భూమిని అదే గ్రామానికి చెందిన వేణు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి పిడుగురాళ్ల రిజిస్టర్ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని అన్నారు. రెవెన్యూ యంత్రాంగాన్ని మేనేజ్ చేసి మ్యుటేషన్ చేయించుకోవాలని ప్రయత్నం చేస్తుండగా బాధితురాలైన పద్మలత ఈనెల 22వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు విన్నవించి ఆదుకోవాలని అర్జీ పెట్టుకుందన్నారు. కలెక్టర్ దీనిపై స్పందించి జిల్లా రిజిస్ట్రేషన్ అధికారిని విచారించి ఈ అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుచేయాలని ఆదేశాలు జారీచేశారని అన్నారు. కలెక్టర్ ఆదేశాలు అమలు చేయాలని జిల్లా రిజిస్టర్‌ను కలిసేందుకు వెళ్లగా రిజిస్ట్రార్ సెలవుల్లో ఉండటం జరిగిందన్నారు. ఎవరైతే సరైన పరిశీలన లేకుండా నకిలీ డాక్యుమెంట్లు ఆధారంగా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారో వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీడీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ప్రసాదు, బాధితులు పరుచూరి పద్మలత పరుచూరి అంజయ్య పాల్గొన్నారు.

బ్లాక్ బర్లీ పొగాకు సాగుపై నిషేధం

వినుకొండ: బ్లాక్ బర్లి టుబాకో సాగు చేయటం నిషేధమని మండల టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్వోలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ అధికారులకు, విలేజ్ ఉద్యానవన అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ కన్వీనర్, తహసీల్దార్ సురేష్ కుమార్, ఏఓ జి. వరలక్ష్మి, ఉద్యాన అధికారి రసూల్ మాట్లాడుతూ మండలంలోని ఏ ఒక్క రైతు కూడా బ్లాక్ బర్లీ పొగాకు పంటను సాగు చేయవద్దని సూచించారు.

లూథరన్ ఎయిడెడ్ హైస్కూల్ మూసివేతకు రంగం సిద్ధం!

యడ్లపాడు: మండలంలోని ఘన చరిత్ర కలిగిన లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల మూసివేతకు రంగం సిద్ధమైంది. దీనికి సంబంధించి విద్యాశాఖ ఆర్జేడీ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని మండల విద్యాశాఖ అధికారి ఎం నాగరత్నం తెలిపారు. ఈ ఉత్తర్వుల మేరకు డీవైఈఓ ఎస్ఎం సుభాని, లూథరన్ హైస్కూల్ రికార్డులను వెంటనే అప్పగించాలని యడ్లపాడు ఎంఈఓను ఆదేశించారు. ఈమేరకు ఎంఈఓ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మలతను ఫోన్ ద్వారా సంప్రదించారు. పద్మలత తాను సెలవులో ఉన్నానని, గురువారం పాఠశాలకు వచ్చి రికార్డులను అప్పగిస్తానని ఎంఈఓకు తెలిపారు. పాఠశాల మూసివేతపై పూర్తి సమాచారం అధికారులు అధికారికంగా తెలపాల్సి ఉంది.

గ్రంథాలయాలకు స్మార్ట్‌ఫోన్‌లు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో అధునాతన గ్రంథాలయాలతో పాటు స్టేట్ సెంట్రల్ లైబ్రరీల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. ఈమేరకు శాసన సభలో ఆమోదం తెలపటం అభినందనీయమన్నారు. పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో బుధవారం శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాలోని 17 గ్రంథాలయాల నిర్వాహకులకు స్మార్ట్‌ఫోన్‌లు అందచేశారు. ఏపీ గ్రంథాలయ పరిషత్ కమిటీ డైరెక్టర్ ఎం.పద్మజా మాట్లాడుతూ, గ్రంథాలయాలకు కంప్యూటర్లు, ఎల్ఈడీ టీవీ, స్మార్ట్ ఫోన్లు అందచేసిన శిక్షణ ఫౌండేషన్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు కార్తీక్, బుచ్చిబాబు, శాఖా గ్రంథాలయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చేపట్టాలి

ఈపూరు(శావల్యాపురం): వరి పంటలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని డాట్ సెంటరు శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నగేష్ సూచించారు. బుధవారం ఈపూరు మండలం కొండ్రముట్ల రైతుసేవా కేంద్రం పరిధిలో వరి పొలాలను వ్యవసాయ సందిర్శంచి రైతులకు తగు సూచనలు చేశారు. ఈసందర్భంగా డాక్టరు నగేష్ మాట్లాడుతూ వరి పొలంలో ఆకు చుట్టు పురుగు వాటి లక్షణాలు గుర్తించినట్లు తెలిపారు. దానికి సంబదించి ఎకరానికి కేలడాన్ 400 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. అలాగే వరి పంట చిరు పొట్ట దశలో ఉన్న సమయంలో 25 కేజీల యూరియా 15 కేజీల పోటాష్‌ను ఎకరానికి వాడాలన్నారు.

'చీకటీగలపాలెంలో పొలం పిలుస్తోంది'

వినుకొండ: మండలంలోని చీకటీగలపాలెం గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా డాట్ శాస్త్రవేత్తలు నగేష్, సత్య గోపాల్, మండల వ్యవసాయ అధికారి జి.వరలక్ష్మి వరి పొలాన్ని పరిశీలించి ఆకు ముడత నివారణ చర్యలు వివరించారు. వరిలో ఎరువులు యాజమాన్యం, జీవన ఎరువులు వాడకం గూర్చి అవగాహన కలుగచేశారు. ఏఈఓ ఆరీఫ్, వీఏఏ పురుషోత్తమరెడ్డి రైతులు పాల్గొన్నారు.

కూటమి అవినీతి, అక్రమాలపై న్యాయపోరాటం జరగాలి

వైఎస్సార్ సీపీ నేతలను కలసి విజ్ఞప్తి చేసిన గోపీచంద్, ఏడుకొండలు


పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గోపీచంద్‌ను సత్కరించిన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మనోహర్ రెడ్డి

నరసరావుపేట: 2024 ఎన్నికల్లో ఈవీఎం ట్యాంపరింగ్ ద్వారా కూటమి అధర్మ మార్గంలో గెలిచిందని ఎందరో సెఫాలజిస్టులు తేల్చి చెప్పారని, ఈ అంశంపై న్యాయ, ప్రజా పోరాటాలు జరగాలని సోషల్ యాక్టివిస్టులు ఈదర గోపీచంద్, దాదిన బోయిన ఏడుకొండలు పేర్కొన్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సహకారంతో తాము రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ నిర్వాహకులు మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పుత్తా శివశంకర్‌రెడ్డి, గ్రీవెన్స్‌సెల్ నారాయణమూర్తిలను కలిసినట్లు బుధవారం వారు పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. అలాగే ప్రముఖ న్యాయవాది బాల, పార్టీ అధికార ప్రతినిధి నాగమల్లీశ్వరిలను కూడా కలసి బాలల హక్కులు – ఇంగ్లీష్ మీడియం పరిరక్షణ కోసం, సోషల్ మీడియా యాక్టివిస్టులు, మహిళలపైనా దాడులు, ఊరూరా పెరిగిన మద్యం బార్, బెల్ట్ షాపులు, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరామని వెల్లడించారు. ఈ దిశలో తన వంతు బాధ్యతగా పార్టీకి రూ.50వేలు విరాళం అందజేసినట్లు గోపీచంద్ తెలిపారు. త్వరలోనే వలంటీర్లు, నిరుద్యోగ భృతి, ఆరోగ్యశ్రీ బకాయిలు తదితర సమస్యలపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తామని వారు తెలిపారు.

దసరాకు బతుకమ్మ అలంకరణ పోటీ


పోటీల కరపత్రం విడుదల చేస్తున్న ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో వాసవి, బతుకమ్మ అమ్మవార్ల బొమ్మల అలంకరణ పోటీలు నిర్వహిస్తున్నట్లు మండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈమేరకు పోటీ పోస్టర్‌ను బుధవారం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో విడుదల చేశారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గత 11 సంవత్సరాలుగా అమ్మవారి బొమ్మల అలంకరణ పోటీ నిర్వహిస్తున్నట్లు వివరించారు. అలంకరించిన బొమ్మలను అక్టోబరు 1వతేదీ సాయంత్రం 6.15 గంటలకు అమ్మవారి ఆలయం వద్ద ప్రదర్శించాలని తెలిపారు. వివిధ రూపాలలో దర్శనమిచ్చే వాసవి మాత, నవదుర్గలు, బతుకమ్మ బొమ్మను అలంకరించి పోటీలో పాల్గొనాలని వివరించారు. పోటీ పాల్గొనే మహిళలు తమ పేర్లు ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదుకు 7075740630, 7337071287, 9848147744 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటి ఛైర్మన్ కొత్తమాసు మెహెర్‌బాబు, కార్యదర్శి కొత్తమాసు వెంకటప్పయ్య, కోశాధికారి పొత్తూరి వెంకట లక్ష్మీ వరప్రసాదరావు, డాక్టర్ రాంప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసరావుపేట డివిజన్

99122 25439 (నరసరావుపేట)
90105 83302 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)

Office mail : sakshigntadvt@gmail.com